క్లుప్తంగా

తిమ్మరాజుపేటలో శాస్త్రవేత్తల పర్యటన



తిమ్మరాజుపేటలో వరిలో తెగుళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో శుక్రవారం శాస్త్రవేత్తలు రమణమూర్తి, రాజ్‌కుమార్ పర్యటించారు. గ్రామంలో సాగు చేస్తున్న వరిపైరును పరిశీలించారు. కత్తెర పురుగు, మానిపండు తెగుళ్ల వరిపైరుకు సోకినట్లు గుర్తించారు. కత్తెర పురుగు నివారణకు వేపనూనె పిచికారీ చేయాలని సూచించారు. మానిపండు తెగుళు నివారణకు క్లోరిఫైరిఫాస్‌ను వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. పంట కోత దశకు చేరుకుంటున్న తరుణంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయాధికారి సీహెచ్. జ్యోత్స్నకుమారి, వీఏఏ శ్వేతా మీనన్, పలువురు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

మునగపాక: మండల వ్యాప్తంగా శనివారం పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వం ఒక రోజు ముందుగానే పింఛన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకుందన్నారు. మండలంలో 8,418 మంది లబ్ధిదారులకు రూ.3.44 కోట్ల నగదు అందుబాటులో ఉంచామన్నారు.

మెగా పీటీఎంను విజయవంతం చేయాలి



వీడియో కాన్ఫరెన్స్ తిలకిస్తున్న ప్రధానోపాధ్యాయులు

మునగపాక: వచ్చే నెల 7న జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని(పీటీఎం) విజయవంతం చేయాలని ఎంఈవో బుద్ధ శివనాయుడు కోరారు. ఇందుకు సంబంధించి హెచ్ఎంలతో శుక్రవారం విద్యాశాఖాధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి తోడ్పడేలా చేసేందుకు, తల్లితండ్రుల భాగస్వామ్యం కూడా పూర్తిగా ఉండేలా నిర్వహించే ఈ కార్యక్రమంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు లక్ష్మీనారాయణ, అచ్యుతకృష్ణ, నూకేష్, సత్తిబాబు, గోవింద, రామలక్ష్మి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని వాడ్రాపల్లి దళితవాడలో శుక్రవారం సాయంత్రం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలన్నారు. ఎటువంటి వివాదాలకు తావులేకుండా స్థానికంగానే సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, పలు శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



స్రవంతి(ఫైల్)

ఎస్.రాయవరం: పెట్టుగోళ్లపల్లి గ్రామానికి చెందిన మల్లు స్రవంతి(20) ఐదు రోజులుగా కనిపించడం లేదని ఆమె తండ్రి రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విభీషణరావు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటర్ చదువుకున్న స్రవంతి ఇంటి దగ్గరే ఉంటుంది. సోమవారం సాయంత్రం బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో తండ్రి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

సాక్షి పర్యాటకం.!



రక్షణ జాకెట్లు లేకుండా బోటులో షికారు చేస్తున్న పర్యాటకులు(ఫైల్)



- అభివృద్ధికి నోచుకోని కొండకర్ల ఆవ
- బోటు షికారులో రక్షణ అంతంత మాత్రమే
- కానరాని ప్రభుత్వ అతిథి గృహాలు
- గత ప్రభుత్వ హయాంలో చేసిన ప్రతిపాదనలు మూలకు

సహజ అందాల కొండకర్ల ఆవ

అచ్యుతాపురం: పర్యాటకంగా అభివృద్ధి చేసే అవకాశం ఉన్నప్పటికీ కొండకర్ల ఆవను పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. పర్యాటకులకు సహజ సిద్ధ ప్రకృతి సౌందర్యమే తప్ప.. మరేలాంటి అభివృద్ధి ఇక్కడ కానరావడం లేదు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సందర్శించి ఆహ్లాదం పొందడటం తప్ప అభివృద్ధికి ఎలాంటి కార్యాచరణను రూపొందించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మానసిక ప్రశాంతతకు అందరూ పర్యాటక ప్రాంతాలను సందర్శించడం అలవాటు చేసుకున్నారు. కుటుంబంతో సరదాగా గడిపేందుకు సుందర దృశ్యాలున్న ప్రాంతాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. అటువంటి ప్రకృతి సోయగంగా ముందు వరుసలో అనకాపల్లి జిల్లాలో సుమారు రెండు వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న కొండకర్ల ఆవ నిలుస్తోంది. పర్యాటకులు పగలంతా ఆయా ప్రాంతాల్లో సేద తీరుతున్నప్పటికీ రాత్రి వేళ బస చేసే వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా కొరవడిన పర్యవేక్షణ

రాష్ట్రంలో అతి పెద్ద సరస్సుల్లో ఒక్కటైన కొండకర్ల ఆవలో బోటు షికారుకు విశేష ఆదరణ ఉంది. తామరాకుల సోయగాలు, కలువ పూల అందాలు, చుట్టూ ఉన్న సహజ సిద్ధమైన కొండలను వీక్షిస్తూ పర్యాటకులు మురిసిపోతారు. బోటులో నుంచి నీటిని తాకుతూ పరవశించిపోతారు. అంతవరకు బాగానే ఉన్న బోటు షికారులో ఎటువంటి భద్రత చర్యలు తీసుకోవడం లేదు. గతంలో రెండు సార్లు బోటు ప్రమాద సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో బోటులో ప్రయాణించే పర్యాటకులకు తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ఇవ్వాలని పర్యాటక శాఖ ఆదేశాలు జారీ చేసింది. కానీ ఈ ఆదేశాలు ఎక్కడా అమలైన దాఖలాలు లేవు.

ప్రైవేట్ రిసార్టులదే హవా

అనకాపల్లితో సహా విశాఖ నగర వాసులు కొండకర్ల ఆవలో విహరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. కట్టి పడేసే ఇక్కడి సహజ సిద్ధమైన అందాలను వీక్షించేందుకు దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. కార్తీక మాసంలో ఇక్కడి పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వారి అవసరాలను గుర్తించిన ప్రైవేట్ రిసార్టులు భారీగానే వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ కాటేజీలు లేకపోవడంతో గత్యంతరం లేక ప్రైవేట్ రిసార్టులకు ఎంతైనా చెల్లించకతప్పని స్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొండకర్ల ఆవ అభివృద్ధికి చర్యలు తీసుకుని, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని పర్యాటకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గత ప్రతిపాదనలు మూలకు..

గత ప్రభుత్వ హయాంలో పర్యాటక రంగ అభి**వృద్ధికి పెద్ద పీట** వేశారు. అనకాపల్లి జిల్లాలోని **పలు పర్యాటక** ప్రాంతాలకు గుర్తింపు ఇవ్వ**టం, వసతుల** కల్పనకు నిధులు కేటాయిం**పులు చేపట్టారు.** ఈ క్రమంలోనే బొజ్జన్న **కొండ వద్ద లేజర్ షో,** ఇతర నిర్మాణాలు **ప్రారంభించారు.** కొండకర్ల ఆవను విహరిం**చే పర్యాటకులు** ఒక ప్రత్యేక ప్రాంతం నుంచి **వీక్షించేందుకు** వ్యూ పాయింట్ నిర్మించాలని **గతంలో ప్రతిపా**దించారు. ఇప్పుడు ఆ సంగతి పక్కన పెట్టేశారు. రాత్రి బస చేసేందుకు, కుటుంబంతో గడిపేందుకు గెస్ట్ హౌస్‌లు, ఫుడ్ పాయింట్‌లు నిర్మించేందుకు గతంలో చేసిన ప్రతిపాదనలు ఇప్పుడు పక్కన పెట్టేసినట్లు తెలుస్తోంది.

ఎస్.రాయవరంలో నేడు గురజాడ వర్ధంతి



గురజాడ కాంస్య విగ్రహం

ఎస్.రాయవరం: గురజాడ జన్మస్థలమైన ఎస్.రాయవరంలో శనివారం ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. గురజాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సింహాచలం



ప్రిన్సిపాల్ సింహాచలంను అభినందిస్తున్న అధ్యాపకులు

పాయకరావుపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సింహాచలం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం జూనియర్ కళాశాలలో ఆయన అర్థశాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. పూర్తి అదనపు బాధ్యతలతో ప్రిన్సిపాల్‌గా సింహాచలంను నియమిస్తూ ఆర్‌జేడీ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆయనను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

పీఏసీఎస్‌లలో వచ్చేనెల 10 నుంచి ఆన్‌లైన్ సేవలు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సహకార అధికారి స్వరూప రాణి

మునగపాక: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)ల్లో వచ్చేనెల 10వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు జిల్లా సహకార అధికారి ప్రేమ స్వరూపరాణి తెలిపారు. మునగపాక (పీఏసీఎ స్)ను శుక్రవారం ఆమె సందర్శించారు. కంప్యూటరీకరణ పనులు ఎంత మేరకు జరిగాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటరీకరణ ప్రక్రియ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 74 సొసైటీలకు ఇప్పటికై 54 సొసైటీల్లో కంప్యూటరీకరణ పనులు పూర్తయ్యాయన్నారు. ఈ విధానం ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులు కూడా కంప్యూటరీకరణకు సహకరించాలన్నారు. సహకార సంఘం ఆడిటర్ గోవిందరావు, సంఘం సీఈవో ఆడారి వేణుగోపాలరావు, పెంటకోట మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అడ్డురోడ్డు-నర్సీపట్నం రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు-నర్సీపట్నం ఆర్అండ్‌బీ రోడ్డుకు రాష్ట్ర హోం మంత్రి అనిత దార్లపూడి గ్రామంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు నుంచి కోటవురట్ల మండలం రామచంద్రపురం శివారు వరకు రోడ్డు విస్తరణ, నిర్మాణానికి నాబార్డు నిధులు రూ.24.32 కోట్లు మంజూరైనట్లు మంత్రి తెలిపారు. ఉన్న రోడ్డును ఇరువైపులా ఐదు అడుగులు పెంచుతూ సుమారు 9.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టనున్నామన్నారు

గత ప్రభుత్వ హయాంలోనే పనులు ప్రారంభం

అయితే ఇదే రోడ్డును విస్తరించి, నిర్మాణం చేపట్టేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ జాప్యం వల్ల నిర్మాణం పనులు జరగలేదు. ఇప్పుడు అదే రోడ్డుకు హోం మంత్రి అనిత శంకుస్థాపన చేయడంపై స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జెడ్పీటీసీ కాకరదేవి, స్థానిక నాయకులు ఈశ్వరరావు, అబద్దం, వెంకటరాజు, అల్లు నరసింహమూర్తి, వంగలపూడి గోవిందు, జ్యోతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం



శివ లింగానికి రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

కశింకోట: స్థానిక పురాతన శివాలయం (సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం)లో శుక్రవారం కార్తీక మాసం సందర్భంగా మాస శివరాత్రిని పురస్కరించుకుని మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసోత్సవాలలో భాగంగా ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా భక్తుల సహకారంతో రుద్రాభిషేకం నిర్వహించారు. పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, బిల్వ దళాలు, విభూతి వగైరా ద్రవ్యాలతో 1008 కొబ్బరి కాయలతో శివ లింగానికి వేద మంత్రోచ్ఛరణల నడుమ ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

ప్రజాదర్బార్‌కు 741 వినతులు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి: రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు నియోజకవర్గం నలుమూలల నుంచి 741 అర్జీలు అందాయి. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎక్సైజ్, నీటిపారుదల, విద్యుత్ శాఖల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. 104, 108 ఉద్యోగులు, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, క్షేత్రస్థాయి సిబ్బంది సమస్యలు పరిష్కరించాలంటూ వినతి పత్రాలు ఇచ్చారు. గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని ఆ సంఘ ప్రతినిధులు కోరారు. నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లింపులు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ తదితర అంశాలపై కూడా దరఖాస్తులు వచ్చాయి. ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసి అర్జీ అందినట్లుగా అర్జీదారుడికి సమాచారం ఇవ్వాలని మంత్రి అధికారులను చెప్పారు. నక్కపల్లిలో సదరం క్యాంపు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందజేశారు. వ్యవసాయ శాఖకు సంబంధించి పంటల బీమా గోడపత్రికలను మంత్రి ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, సీఐ కుమార స్వామి, మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి

అచ్యుతాపురం: పరవాడలోని జేఎస్ ఫార్మాసిటీలో ఉన్న ఠాగూర్ ఫార్మాలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు కార్మిక శాఖ మంత్రి రూ.40 లక్షల చొప్పున పరిహారం ప్రకటించడం అన్యాయమన్నారు. ఠాగూర్ ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రమాద ఘటనలో అస్వస్థతకు గురైన 27 మందికి సరైన చికిత్స అందించాలని కోరారు. ప్రమాదాలు జరిగినప్పుడు కమిటీలు వేసి చేతులు దులుపుకొంటున్నారు తప్ప, కారణమైన కంపెనీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఫార్మా కంపెనీలు విఫలమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం జరగకపోతే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

కొనసాగుతున్న అన్నసమారాధన



వెంకటాపురంలో అన్నదానంలో భక్తులు

మునగపాక: వెంకటాపురంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన కార్యక్రమం శుక్రవారానికి 28వ రోజుకు చేరుకుంది. కార్తీకమాసంలో భాగంగా భక్తులకు నెలరోజుల పాటు అన్నసమారాధన నిర్వహణకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. రోజుకు 1000 మందికి అన్నదానం చేస్తున్నారు. శుక్రవారం మాజీ సర్పంచ్ సుందరపు కనకప్పారావు సహకారంతో అన్నదానం జరిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుందరపు తాతాజీ, వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రతినిధి బొమిరెడ్డిపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కొత్త నాగవరం రహదారి



అధ్వానంగా దర్శనమిస్తున్న కొత్తనాగవరం రోడ్డు

మునగపాక: మండలంలోని కొత్త నాగవరం రోడ్డు అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గోతులు దర్శనమివ్వడంతో వాహనచోదకులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. రాజుపేట నుంచి కొత్త నాగవరం మీదుగా అటు పరవాడ అలాగే అచ్యుతాపురం వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ రోడ్డు అనువుగా ఉంటుంది. ఈ రోడ్డు శిథిలావస్థకు చేరడంతో గోతులను తప్పించే క్రమంలో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో గోతుల్లో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి కొత్త నాగవరం రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బెల్టుషాపు వేలంపై కేసు

ఎస్.రాయవరం: పేటసూదిపురం గ్రామంలో మద్యం బెల్టు షాపు ఏర్పాటుకు వేలం నిర్వహించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. గ్రామంలో దండోరా వేయించి పాట నిర్వహించిన గ్రామ పెద్దలు, పాట దక్కించుకున్న వారిపై కూడా కేసులు ఉంటాయన్నారు. ఈ కేసులో విచారణ పూర్తి చేసిన అనంతరం బాధ్యులను గుర్తించి కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడినా, నిర్వహించినా చర్యలు తప్పవన్నారు.

అధ్వాన రహదారులకు మోక్షమెన్నడో?

కోటవురట్ల: అధ్వాన రహదారులకు మోక్షం కలగడంలేదు. గ్రామీణ రహదారులన్నీ గోతులమయంగానే దర్శనమిస్తున్నాయి. వర్షాలు పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. అన్నవరం, రాజుపేట, లింగాపురం వెళ్లే రహదారులు చాలా అధ్వానంగా తయారయ్యాయి. గోతుల్లో పడి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అన్నవరం రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గోతులు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



రోడ్డు నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, తదితరులు

రాంబిల్లి(యలమంచిలి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాంబిల్లి మండలం రాజారాయుడుపాలెం గ్రామంలో రూ.6.90 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఆయన శిలాఫలకం ఆవిష్కరించి, శంకుస్థాపన చేశారు. నాబార్డు నిధులతో రాజారాయుడుపాలెం నుంచి వ్యవసాయ భూములకు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, కూటమి నేతలు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాల పంపిణీ

రాయితీపై అందిస్తున్న విత్తనాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. శుక్రవారం ఆయన రాంబిల్లి మండలం మర్రిపాలెం గ్రామంలో రైతులకు రబీ పంటల విత్తనాలు మినుములు, పెసర విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ పంటల బీమాను నమోదు చేసుకోవాలని కోరారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి వచ్చే పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సిహెచ్.సుమంత, తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



యలమంచిలి పురపాలకసంఘం కార్యాలయం

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ 48వ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు శుక్రవారం తెలిపారు. సమావేశం కోసం 20 అంశాలతో ఎజెండాను సిద్ధం చేశారు. ఈ అంశాల్లో చాలా వరకు ముందస్తుగా ఆమోదం పొందినవే ఉన్నాయి. ఎజెండా అంశాల్లో ప్రధానంగా 2022-23వ సంవత్సరం రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.72 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులను రాష్ట్ర పురపాలక కమిషనరు ఆదేశాల ప్రకారం సీసీ రోడ్లు, కాలువలు, డంపింగ్ యార్డుకు ప్రహరీ, పారిశుధ్యం పనులు, నీటి సరఫరా తదితర ముఖ్యమైన పనుల కోసం వినియోగించనున్నారు. ఎజెండాలో పొందుపరిచిన అంశాలపైనే ప్రధానంగా సభ్యులు చర్చించి ఆమోదం తెలపనున్నారు. 25 వార్డులున్న పురపాలక సంఘ పాలక వర్గంలో టీడీపీకి ఒక్క సభ్యుడే ఉండగా.. 23 వార్డులకు వైఎస్సార్‌సీపీ సభ్యులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

అటెన్షన్ ప్లీజ్



కోరవుటర్ల మండలంలోని పాత రోడ్డు వంతెనపై ప్రమాదం పొంచి ఉంది. ఈ వంతెనపై ఓ పక్క కొంతమేర రక్షణ గోడ కూలిపోయింది. పలు గ్రామాలకు వెళ్లే రహదారిలోని వంతెన కావడంతో వాహనదారులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు, రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆదమరిస్తే వంతెనపై నుంచి కింద పడే ప్రమాదం ఉంది.

స్పందించాల్సిన అధికారి: నారాయణరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ
ఫోన్ నంబర్ : 94945 45362

– కోటవురట్ల